# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్ - నిర్మల్





ముథోల్ : గ్రామసభలో నిరసన తెలుపుతున్న మహిళలను సముదాయిస్తున్న పోలీసులు

● గ్రామసభల్లో గందరగోళం

డే-1

# నిరసనలు,, నిలదీతలు

## ప్రజాపాలన గ్రామసభల్లో అధికారుల తీరుపై జనం మండిపాటు

- అనర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంపై అసహనం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలుచోట్ల గందరగోళంగా సభలు
- అర్హుల పేర్లకు బదులు అనర్హుల పేర్లు రావడంపై ఆందోళన
- ప్రభుత్వ యంత్రాంగం, ప్రజల మధ్య తీవ్ర వాగ్వాదం
- దరఖాస్తులను ఎన్నిసార్లు ఇవ్వాలంటూ ఆగ్రహం
- చాలా చోట్ల గ్రామసభల నుంచి వెళ్లిపోయిన జనం
- కొన్నిచోట్ల సభలు నిర్వహించకుండానే వెళ్లిన అధికారులు
- పలు గ్రామాల్లో పోలీసు బందోబస్తు మధ్య సభల నిర్వహణ



బజార్‌హత్నూర్ : అర్హులైన వారి పేర్లు జాబితాలో రాలేదని గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, జనవరి 21(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభల్లో అధికారులకు నిలదీతలు, నిరసన సెగలు తగిలాయి. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇం డ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 24వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో వార్డులవారీగా సభలు నిర్వహించనున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు, జిరాక్స్‌ల కోసం జనం పరుగులు తీశారు. దరఖాస్తు ఫారాల కొనుగోలు కోసం రూ.30 వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని దరఖాస్తుదారులు తెలిపారు.

### ఇది నిరంతర ప్రక్రియ

జనం నుంచి వ్యతిరేకత రావడం, గ్రామసభల్లో అధికారులను నిలదీస్తున్న నేపథ్యంలో చాలా గ్రామాల్లో పోలీసులను మోహరించి సభలు నిర్వహించారు. కొన్ని సభల్లో అధికారులతో పాటు పోలీసులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం వచ్చింది ఒక జాబితానేనని, అర్హులందరినీ న్యాయం జరుగుతుందని, ఈ దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని పలుచోట్ల అధికారులు ప్రజలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేయాలి. ఆరు గ్యారెంటీల కోసం ఒకసారి, సమగ్ర కుటుంబ సర్వేప్పుడు మరోసారి.. ఇప్పుడు గ్రామసభల్లోనూ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం ఏంటని జనాలు అధికారులను నిలదీశారు. అసలు చేసిన దరఖాస్తులను పట్టించుకుంటున్నారా? లేదా? ఈసారి గ్రామసభల్లో చేసిన దరఖాస్తులైనా పరిగణలోకి తీసుకుంటారా? లేదా? చెప్పాలంటూ మండిపడ్డారు. ఒక్క పథకానికి ఇన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాల్సి రావడంపై అసహనం వ్యక్తం చేస్తూ జనాలు సభల నుంచి వెనుతిరగడం కనిపించింది.

### రేషన్ కార్డులో పేరు రాలేదు..



రేషన్ కార్డుకు నేను అన్ని విధాలుగా అర్హుడిని. నా పేరు లిస్ట్‌లో రాలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకున్న. ఇలా ప్రతిసారి దరఖాస్తు చేసుకోవడమే తప్ప లిస్టులో పేరు మాత్రం రావడం లేదు. ఇలా ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలో అర్థం కావడం లేదు. మాసోంటి గరీబోళ్ల పేర్లు కూడా జాబితాలో రాకపోతే ఎలా? ఈ సర్కారు, అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

**- మేర భాస్కర్ దంపతులు**

### పదేండ్లుగా కిరాయి ఇంట్లో ఉంటున్నా..



నేను కూలీ పని చేసుకుంటూ ఉపాధి పొందుతా. కష్టపడి పనిచేసి సొంత జాగా కొనుగోలు చేశా. పదేండ్లుగా కిరాయి ఇంట్లో ఉంటున్న. నేను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. ఆదిలాబాద్ మన్సిపాలిటీలో ఆరో వార్డు పరిధిలోకి మా కాలనీ వస్తుంది. ఈ రోజు పెట్టిన లిస్ట్‌లో మా పేరు రాలేదు. అధికారులను అడిగితే మరోసారి దరఖాస్తు ఇవ్వమన్నారు. దరఖాస్తులు జిరాక్స్ సెంటర్‌లో ఉంటాయని అంటున్నారు.

**- సోహల్, ఇందిరమ్మ కాలనీ, ఆదిలాబాద్**



“ ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఆరో వార్డులో గల సేవాదాస్ స్కూల్‌లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజాపాలనలో ఈ వార్డు నుంచి ఇందిరమ్మ ఇండ్లకు 650 మంది, రేషన్‌కార్డులకు 260 మంది దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం నిర్వహించిన గ్రామసభలో 65 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 143 మంది పేర్లతో కూడిన జాబితాను ప్రదర్శించారు. రేషన్‌కార్డులను ఈ నెల 26 నుంచి పంపిణీ చేస్తామని ప్రకటించినా.. ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడుతలో కేవలం ఆరుగురికి మాత్రమే కేటాయించారు. జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో వార్డు ప్రజలు మరోసారి దరఖాస్తు ఇవ్వడానికి గ్రామసభలో బారులు తీరారు.



సిరికొండ గ్రామసభలో గ్రామస్తులను సముదాయిస్తున్న అధికారులు



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన జాబితాలో పేరు లేకపోవడంతో రోదిస్తున్న నూతి జ్యోతి

### సభలో కన్నీరు పెట్టుకున్న మహిళ

వాంకిడి మండలంలోని బంబార గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా లో నిరుపేద కుటుంబానికి చెందిన ఒంటరి మహిళ నూతి జ్యోతి తన పేరు లేకపావడంతో గ్రామసభలో కన్నీరు పెట్టుకున్నది. పూరిగుడిసెలో కుమారుడితో ఒంటరిగా ఉంటు కూలీ పనులు చేసుకునే తనకు ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించి పథకాలు అందేలా చుడాలని కోరారు.

### ఆత్మీయ భరోసాకు అర్హుడిని కాదట..



నాకు గుంట భూమి లేదు. ఉండడానికి ఇల్లు కూడా లేదు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రేవంత్‌రెడ్డి పాలనలో ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లకు నేను అర్హుడిని కాదంట. లిస్ట్‌లో నా పేరు రాలేదు. భూములున్న చాలా మంది పేర్లు లిస్టులో వచ్చాయి. కానీ.. మా లాంటి గరీబోళ్ల పేర్లు రాలేదు.

**- కామలే మల్లేశ్, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్.**



ఇంద్రవెల్లి : పిప్రిలో దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

### ఆందోళనలు ఇలా..

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో జరిగిన సభల్లో స్థానిక ప్రజలు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది.
- మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని పోలంపల్లి గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల పేర్లు రాకుండా అనర్హుల పేర్లు వచ్చాయంటూ గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు. గ్రామంలో నివాసం ఉండని వారి పేర్లు, భూములు, ఆస్తులు ఉన్న వారి పేర్లు వచ్చాయంటూ సభకు వచ్చిన జనం గొడవకు దిగారు. గ్రామసభను బహిష్కరిస్తామని ఆందోళన చేశారు. అధికారుల వినతి మేరకు ఎంఆర్‌వోకు రీ-సర్వే చేయాలని లెటర్ రాసి ఇచ్చారు.
- ఇదే మండలంలోని ఎల్కేశ్వరంలో రేషన్ కార్డుల కోసం అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. కాజీపల్లి, కొత్తపెల్లి గ్రామాల్లోనూ అధికారులకు నిరసన సెగ తగిలింది.
- జన్నారం మండలంలోని తపాలాపూర్ గ్రామసభలో అధికారులను స్థానికులు నిలదీశారు. దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు జాబితాలో రాలేదని, దీనికి కారణం ఏంటో చెప్పాలని ప్రశ్నించారు.
- ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామసభలో ప్రజలు అధికారులను నిలదీశారు. పథకాల కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నామని, ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రశ్నించారు. ఈసారి దరఖాస్తు చేసుకుంటే ఇండ్లు, రేషన్ కార్డులు వస్తాయా? లేదా? చెప్పాలని నిలదీశారు. దరఖాస్తు చేసుకోవాలని ఒకసారి, సర్వే పేరుతో ఒకసారి దరఖాస్తులు తీసుకున్నారని, ఇప్పుడు గ్రామసభల పేరుతో లబ్ధిదారుల లిస్టు పెట్టి మరోసారి దరఖాస్తు తీసుకుంటామని చెప్పడం వెనుక మతలాబేంటో చెప్పాలన్నారు.
- బజార్‌హత్నూర్ గ్రామసభ గందరగోళ పరిస్థితుల మధ్య సాగింది. అర్హులైన పేర్లు రాలేదంటూ గ్రామస్తులు గొడవకు దిగారు.
- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గ్రామసభలో అర్హులైన పేదలను కాకుండా అనర్హులను ఎంపిక చేశారంటూ అధికారులను, అధికార పార్టీ నాయకులను ప్రశ్నించారు.
- నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ సభలో తమ పేర్లు ఎంపికైన వారిలో జాబితాలో ఎందుకు రాలేదని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కార్యక్రమం నిర్వహించకుండానే అధికారులు వెనుతిరిగి వెళ్లిపోయారు.
- ముథోల్ మండలంలోని ఏడ్బిడ్‌లోనూ లబ్ధిదారుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో అధికారులను కొందరిని సభ నుంచి బయటికి పంపించి సభ నిర్వహించారు.



సోన్ : కడ్తాల్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



నార్నూర్ గ్రామసభలో జాబితాలో పేర్లను చూసుకుంటున్న ప్రజలు



ముథోల్ : గ్రామసభలో నెలకొన్న గందరగోళం



నిర్మల్ చైన్‌గేట్ : నాయుడు వాడ గ్రామసభలో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్

# కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎదులాపురం, జనవరి 21 : ‘గౌరవ వేతనం వద్దు.. ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు కావాలి’ అంటూ ఆశ వర్కర్లు ఆందోళన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం అన్ని జిల్లా కేంద్రాల్లో ఆశ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్స్‌కు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ కుమార్, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నైతం శోభ, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, ఆశ నాయకులు లక్ష్మి, మాధవి, ఆశ, స్వప్న, సురేఖ, మమత, హారిక, ఉమా, కవిత పాల్గొన్నారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

# కాంగ్రెస్ ప్రభుత్వ తీరు కటాఫ్, కటీఫ్

● ఆరు గ్యారెంటీల అమలులో విఫలం ● ఎన్నికల్లో లబ్ధి కోసం గ్రామసభలు ● మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జనవరి 21(నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కటాఫ్ తేదీలను ప్రకటిస్తూ కాలయాపన చేస్తున్నదని, తర్వాత ఈ పథకాలను కటీఫ్ చేస్తున్నదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర పథకాలను పక్కన పెట్టిందన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో రోడ్డు సౌకర్యాలు ఉన్న గ్రామాలకు బస్సులను నడపడం లేదన్నారు. జిల్లాలో మహాలక్ష్మి పథకంలో 2.04 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే వారికి ఎలాంటి ప్రయోజనాలు చేకూరలేదని తెలిపారు. రూ.500 గ్యాస్ సిలిండర్ కోసం 1.81 లక్షల మంది దరఖాస్తు చేస్తే కేవలం 95 వేల మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, పంటల బీమా, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం, కళ్యాలక్ష్మి పథకంలో భాగంగా తులం బంగారం, విద్యార్థినీలకు స్కూటీలు, అమరుల కుటుంబాలకు ఉద్యోగం, పింఛన్ల విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికి గ్రామసభలు నిర్వహిస్తూ వివిధ పథకాలతో ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుదారుల్లో అర్హులైన వారిని ఎందుకు ఎంపిక చేయలేదో ప్రజలు ప్రశ్నించాలని, ఇందుకు కారణాలు చెప్పాలని అడగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, పెందూర్ దేవన్న, బుట్ట సతీశ్, మార్సెట్టి గోవర్ధన్, కుమ్ర రాజు, విఠల్, సంతోష్, దయాకర్, అశోక్, జావిద్‌లు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

### మాజీమంత్రికి సన్మానం

బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ సభ్యుడిగా ఎంపికైన మాజీ మంత్రి జోగు రామన్నను బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి మాజీ మంత్రి జోగు రామన్న కృషి చేస్తున్నారని స్థానిక నాయకులు తెలిపారు.

# ఆశ కార్యకర్తల పాదయాత్ర

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 21 : ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు మంగళవారం ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాత కలెక్టర్ కార్యాలయం నుంచి కొత్త కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కలెక్టర్ ఎదుట నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సుజాత, చంద్రకళ, ఇంద్రమాల, మౌనిక, ఉజ్వల, విజయ, సరిత, శ్రీలత, లావణ్య, పద్మ, వినోద, లక్ష్మి, భాగ్యలక్ష్మి, అనసూయ, తదితరులు ఉన్నారు.



నిర్మల్‌లో పాదయాత్ర చేస్తున్న ఆశ కార్యకర్తలు